# భువనగిరి

పార్వతి శపించక పూర్వం, దేవతలందరూ, మన లాగానే, అచ్చటా ముచ్చటా అన్నీ తీర్చుకుంటూ, పిల్లా పాపా, కంటూ, ఏ వయసుకు తగిన మురిపెం ఆ వయసున అమర్చుకుంటూ, మనకు ప్రతిగా, మనకు, మనసుకు అదేచోట సుఖంగా ఉండేవారు కద!'

జనాభా ఎంత పెరిగినా, వాళ్ళకు ఆహార, వస్త్రసమస్యలు ఎన్నడూ దాపురించేవి కావు; అక్షయంగా, దివ్య వృక్షాలు, కావలసిన దినుసులన్నీ శాఖశాఖలా వెలయించేవి; జరా, మృతీ, కూడా ఉండేవి. అందుచేత విసుగెత్తి వెక్కసమయే బ్రతుకు అంతవరకూ కలలోనైనా కనిఎరుగరు.

పార్వతి దేవతలనందరినీ, ఒక్కుమ్మడిగా శపించిందంటే, – అందులో ఆ యిల్లాలి దోషం ఏమీ కనిపించడం లేదు. దేవతలందరికీ అలాటి అకార్యం తలపెట్టవలసినంత అవసరం ఏమి వచ్చిందో గోచరించడం లేదు. ఆ దంపతుల అఖర్వ కేళీ విలాస ఫలితముగా ఓ కొడుకు ఖచ్చితంగా పుట్టాడే అనుకున్నా, ఆ బుడతడు, దేవతల హితైషిగానే ఉంటాడు గనుక, ఉపద్రవమేమీ ఉండదు.

తమ అందరికీ సహజమైన ఉబలాటమే ఆ దంపతులూ ఉడుతూన్నప్పుడు – వీళ్ళ పుట్టి అంతా ముంచుకు పోయినట్టు, ఆ రవంత ముచ్చటా ఎందుకు చెడగొట్టారు? – శివతాండవోద్ధతిని సహించి, భరించిన చతుర్దశ భువనాలూ, ఈ కలాపాన్ని భరించలేననడం ఏమంత సబబుగా ఉంది?

ఈ సందర్భంలో, శివుడి విషయంలోనూ ఒకటి రెండు లోపాలు ఉన్నవి: వీళ్ళందరినీ, అంతికానికి ఎందుకు రానిచ్చాడు? – ఎప్పుడూ అప్రమత్తుగా కావాలి ఉండే ప్రమథులు, పరాకు వహించారా? – ఆయెబో, – వీళ్ళందరూ మూక కట్టి, పానుపు చుట్టూ చేరి అలా ఘోషించితే, – ఫాలనేత్రం ఝళిపించకుండా ఎందుకు సహించి ఊరుకున్నాడు? – శృంగారకాండ, ఎందుకు విరమించాడు? – నిజానికి తనకు మక్కువ లేకనా? – అన్ని దివ్య వర్షాలూ తలపడినది – కేవలం, ఆ యిల్లాలు పోరుపడలేకనా? శివుడి మనసులో మాట ఏమిటి మనకు తెలియడం లేదు.

భక్త పరాధీనుడై పడకటిల్లు విడిచాడు. పార్వతి – వీళ్ళ మీద కోపాన, వీళ్ళందరినీ శపిస్తూన్నాననుకుని – వీళ్ళ పెళ్ళాలను శపించింది.

'నేను బిడ్డ తల్లినయే యోగానికి ఇలా అంతరాయం కలిగించారుకదా – మీ పెళ్ళానికి ఎన్నటికీ బిడ్డలు పుట్టరు –'

దేవతలందరూ, ఈ ఘనకార్యానికి తరలి వెళుతూన్నప్పుడు, ఒక్కడుకూడా, ఇంటి దగ్గర చెప్పి వచ్చినట్టు తోచదు. సాటి ఆడుదాని మమతకు విఘాతం కలిగించడానికి యీ ధీరులందరూ బయలుదేరుతున్నారంటే ఏ జాణ అనుమతిస్తుంది?

– నిజంగానే ఆ దంపతుల శృంగార ధోరణికి లోకాలన్నీ దద్దరిల్లి పోతూన్న పక్షంలో – దేవలోకంలో ఒక్క మగజాతే రాయబారం చేయడమేం? – దేవతలు ఆ విషయంలో అబద్ధమే ఆడారు. సరే, అందుకు ఘట్టి దెబ్బే తిన్నారు.

మరి, – అనంతర కరణీయం?–

వీళ్ళ పెళ్ళాలకు యీ సంగతి తెలిస్తే, – వీళ్ళ పని ఏంకాను? – గుట్టు ఎంతకాలం దాచగలరు, – అలాగని?–

దేవలోకంలో ఎల్లకాలమూ వసంతమే ఆయెను. ఎప్పుడూ – అనంత అఖండ శృంగారమే, – కాని, ఎన్ని దివ్య వర్షములు గడచినా – ఏ ఒక్క యింటా పసిపాప పోరు వినపడందే? – కనిపించే యిల్లాళ్ళందరికీ ఏనాటికైనా విడ్డూరంగా ఉండదూ? మగలందరూ, ఒక్కసారిగా ఉన్నట్టుండి, ఇలా మూగపోయినారా? – పార్వతి శాపం వైనం, – ఆరాతీయగా వాళ్ళకు తెలిసింది – మగవారందరినీ, – ఆ పడుచులు ఎంత అసహ్యించుకున్నారో? – ఆ తరువాత, ఏ దేవతా, తలయెత్తి అలివంక చూసినట్టు కాని, – దరిచేరినట్టుకాని, – తార్కాణం లేదు. సంతాన వాంఛతో ధర్మబద్ధమైన గార్హస్థ్యాన్ని పాలించే వేల్పు పురంధ్రులు, – భోగినులుగా మారిపోగలరా? – కనక దేవతల మగరాయళ్ళందరికీ అదే మొదలు నిర్బంధ బ్రహ్మచర్యం.

అదొక్కటే దొసగుకాదు. పార్వతి శాపం దేవద్రుమాలకు కూడా సోకింది. ఏ తరువైనా పూచేదే కాని, – ఒక్కటి ఫలించదాయెను!

ఇది ఇల్లా ఉండగా, – దీనికి తోడు ఎప్పుడూ ఉండే రాక్షసబాధ దేవలోకానికి, మరింత ఉద్ధోలమైంది. వీళ్ళు శాపగ్రస్తులూ, నిర్వీర్యులూ, కావడంతో, దానవులు మరింత విజృంభించారు.

ఇలా తమకు తలవని తలంపుగా ఉపకారం చేసిన భవానిని కులదేవతనుగా చేసుకున్నారు. కొంతకాలం వాళ్ళను ఎదిరించేవాళ్ళే లేకపోయినారు.

మునుపైతే దానవులతో ఘర్షణ వచ్చినప్పుడల్లా, ప్రతి యిల్లాలూ భర్తను ఎంతో ఉత్సాహంగా రణరంగానికి పంపించేది. విజయంతో తిరిగి వచ్చేదాకా ఎదురెదురు చూస్తూండేది. ఇల్లాలి మెరమెచ్చే, ప్రతి దేవతకూ, – సగం సత్తువ యిచ్చేది, ఇప్పుడు అది ఉడిగిన మీదట – కాళ్ళు యీడ్చుకుంటూ యుద్ధానికి వెళ్ళినా, – గెలిచినా, – ఆ సంతోషం ఎవరనుభవించను?–

వరుసగా, దేవదానవ యుద్ధాల్లో, – తడవ తడవకూ, లెక్కలేనందరు దేవతలు రాలిపోతూండటమే కద్దు; ఇలా అయితే, – కొంత కాలానికి, దేవతల జాతే నామరూపాలు లేకుండా పోదూ? – మిగిలిన వాళ్ళైనా చావు తప్పి కలకాలం బ్రతికి ఉండటం ఎలా?–

కలకాలం రహస్య పరిశోధనలు సాగించారు. క్షీరసాగరం మధించారు. దానవులకు యీ గూడు పుఠాణీ అంతా తెలిసే, – సాయం చేసినట్లు నటించి, – తరచిన తరువాత, – దాన్ని దక్కించుకుందామనుకున్నారు. దేవతలు, ఎత్తుకు పై యెత్తుగా, అవసరమైన చాకిరీ అంతా దానవులచేత చేయించుకుని, చివరకు సొడ్డు వేద్దామనే కాపుమీద ఉన్నారు. వీళ్ళ అదృష్టం కొద్దీ – మరెందుచేతనైతే కానీ, – అలాగే జరిగింది – విధి, వీళ్ళకే అనుకూలించింది!

దొరికినదే తడవుగా, మెక్కడమే పని, – అమృత భాండాన్ని, యీ మగరాయళ్ళందరూ – ఆ సముద్ర తీరాన్నే గుటక వేశారు. ఇల్లూ వాకిలీ యిల్లాలూ – యీ సంగతే మరచిపోయినారు. లేక, చేయాలనే అలా చేశారేమో? తమకు అక్కరకు రాని యిల్లాళ్ళు, ఎల్లకాలం బ్రతికి ఉండవలసిన అగత్యం – వీరికి ఏం ఉన్నదీ? – తమ అక్కర తీర్చుకునేందుకు, అచ్చరపిండు, ఎలాగూ రానే వచ్చిందాయెను! – మానుషం ఉన్న, ఆ యిల్లాళ్ళు, ఒకవేళ వీళ్ళు కనికరించి మిగిల్చినా, అమృత పానం చేసే వాళ్ళా? – బిడ్డా పాపాలేకుండా, అనంతంగా అల్లా బడుగుల్లాగా బ్రతికి ఉండటం వాళ్ళకు మాత్రం పరువా? – ఆ యిల్లాళ్ళందరూ క్రమేణా అంతరించిపోయి ఉండాలి.

దేవతలు, దానవులకే కాదు, శివుడికే అన్యాయం చేశారు. అమృతం ఒక్క చుక్క యిచ్చారా? – ఉహుఁ! – హాలాహలం! ఆ వెర్రివాడు యిది అమృతం కన్న ఘాటైనదని, అంతా ఏకాపోశనం పట్టబోయి, యీ నాటికీ అది గొంతు దిగక చిందులు త్రొక్కుతున్నాడు.

అసలు వీళ్ళందరినీ తలదన్నిన లౌక్యుడు విష్ణువు. అందరిదీ రెక్కల కష్టం – తాను మాత్రం వెన్నుతో కాస్తానన్నాడు. ఆసరా ఎంతవరకూ యిచ్చాడో, ఆ అయ్యకే ఎరుక వీళ్ళూ వాళ్ళూ సతమతమై, అమృతభాండం అంటూ వెలసిన ఉత్తరక్షణంలో, కలకలలాడుతూ, అందరి మధ్యకూ ఘల్లున తళుక్కుమన్నాడు.

దానవులు, ఎప్పుడూ నీతికి కట్టుబడి ఉన్నవాళ్ళే. తమకూ తమకూ తగవు ఎలాగూ తెగడం లేదు. – ఏవరో ఓ చక్కని చుక్క పాలు పంచుతానంటే వాళ్ళు వెంటనే సరే అన్నారు. దేవతలందరూ ఎంతకాలం నుంచో, ఆడముచ్చటకు మొగం వాచి ఉన్నారాయెను. వాళ్ళకు, దుత్త దుత్తా ఆ చిన్నదాని చేతికి అందియ్యడానికి అభ్యంతరం ఏముందీ? – కాని, వడ్డించే పడుచు వీళ్ళ వంకది కావడం, – వీళ్ళకు అనుకోని మేలు, ఆ చిన్నది, తనకై ఎంత మిగుల్చుకున్నదో – ఎవరికీ అంతుచిక్కినట్టు లేదు.

అదీగాకుండా,– ఈ కిటుకు కనిపెట్టి యీ పంచడంలో ఏదో మోసం ఉందని పసికట్టి, – ఎందరు దానవులు – కామరూపులు గనుక దేవతలలో చేరి, – అమృత ప్రాశన చేశారో? – ఎవడో, ఒకడో అరో అభాజనుడు పట్టుపడ్డాడు గాని, – నాటికీ నేటికీ గుట్టు చెడకుండా, దేవతలై బ్రతుకుతున్నా రాక్షసులు ఎంతమంది ఉన్నారో? –

అదంతా సరే! – అమృతంతో, దేవతల బాధలు తాత్కాలికంగా తీరినట్లే కద! – చావు లేకపోవడంతో దానవ యుద్ధాలు సన్నగిలినవి: యిల్లాళ్ళందరూ ముదుసలి తనంతో సమసిపోయనా, నిత్యయౌవనలైన అచ్చరలు, – కొల్లలుగా సమకూరారు: – దేవతలు, శత్రువులకు భయపడే అగత్యం లేదు. మన్మధుడంటే బెదరే లేదు. స్వర్గం – నికరంగా భోగభూమి అయిపోయింది!

వాళ్ళది – భోగభూమి సరే. మనది, మరి, కర్మభూమి ఆయెను. ఉత్తమకర్మలు ఆచరించడానికి కాకుండా, అనురూపమైన ఫలం అనుభవించేందుకూ మన యాజులకు అధికారం ఉందాయెను. ఇది దేవతలకు మరో చౌగండం! క్రమంగా అచ్చరలందరూ

క్రతుఫలం మూటగట్టుకు వచ్చినవాళ్ళు పరమైపోయినారు. ఉన్నవాళ్ళల్లో పసందైన వాళ్ళు ప్రభువు పాలు. వీళ్ళు మళ్ళీ మొదటి స్థితికే వచ్చారు. ఎలాగో వీలు చేసుకుని ఏ యాగానికో ఒక్క సారన్నా కనికరించమని ఏ అచ్చరచానను బ్రతిమాలుకున్నా – ఎవతెకైనా, – పోనీ పాపం అని జాలికలిగినా, – ఎవ్వతెకుగాని, ఏదీ, – వీలు, – తీరుబడి? – ఏం బ్రతుకు? –

దేవలోకంలో కిలకిలలన్నీ, – అసహ్యంగా ఎప్పుడూ చెవులలో మారుమ్రోగు తూంటే, – వీళ్ళందరూ అలా గ్రుడ్లు అప్పగించి, వింటూ, కంటూ, ఎండూ, పందూలేని పాదపాల దగ్గిర పడి ఉంటారు!

చేజేతులా చేసుకున్నందుకు అంతకు అంతా అనుభవిస్తున్నారు. చచ్చిపోలేరు. బ్రతికి ఉన్నందుకు ఏ విధానా సుఖపడలేరు! – క్రమంగా నామరూపాలు కూడా లేకుండా పోయినారు. లెక్క ఎంతో – వీళ్ళ సంఖ్య, మనకు ఆనమాలు కాని, – ఒక్కడి పేరు కాని తెలుసునా? –

వాళ్ళు ఏమైపోయినా, మనకు లోటేం లేదు కాని, – ఆ తరుణాన, – ఎన్నో కలలు కంటూన్న కన్నెకుమారులందరి బ్రతుకూ నిప్పచ్చరమైపోయింది కదా అని అనుకున్నప్పుడు, మనసు చివుక్కుమంటుంది. ఈడొచ్చిన దేవకన్య ఎవ్వతే, – మూడుముళ్ళూ పడే యోగం లేకుండానే అంతరించిపోయింది కదా!

ఈ గత్తర లేకుండా ఉంటే, – జయంతిని ఎవరు చేసుకునే వాడో? స్వర్గానికి ఏ దేవుడు అల్లుడయే వాడో? – ఆ చిన్నదానిమాట అనుకున్నప్పుడు, 'అయ్యోపాపం!' అనుకోమూ?–

దేవతలు ఎంత దురదృష్టవంతులు! మడిగట్టుకు కూర్చున్న బ్రహ్మ, – సాటిదేవతలలాగ ఎవ్వతెనో మరిగి సంతృప్తి పడకుండా, యథావిధిగా గృహస్థు అవుదామని కూర్చునేప్పటికి – ఏమైంది? – తన యిల్లాలిని తానే కనాల్సి వచ్చింది. ఆ కనడమన్నా తలక్రిందులుగా – కన్నాడే అనుకుందాం, ఎలాగో – అలా నోట్లోంచి ఊడిపడ్డ ఆ కొమ్మతో తాను ఎంత సుఖపడేదీ, జగద్విదితమే కద! – అంతటితో పోకుండా, – తన యిల్లాలికి సంతానం కావలసి వచ్చినా, – తానే కనాల్సి ఉండి – మనసుతోనే కానీ!

దేవతల పడుచుకానందువల్ల లక్ష్మీదేవి, పెనిమిటికి ఉత్తమ గతులు కల్పించడానికి స్వయంగా పూనుకుని, కృతార్థురాలు అయింది. అయితే ఆ పుట్టిన కుర్రవాడు, – ఆమె పెనిమిటి పేర చలామణి కాలేదని – బాణభట్టు మనకు రుజువు.

గొడ్రాలితనం మాపుకునేందుకు మనిషి సాహాయ్యం కోరింది, ఈ అమ్మవారు ఒక్కతే కాదు. – ఈవిడ పట్టిన నోము ఎడనెడ ఒకళ్ళిద్దరు అచ్చరలు కూడా పట్టారు. మాట వరసకు, కుబేరుడి తల్లి ఇలబల, మన తృణబిందుడి కూతురేకద!

ఇంత చేసిన తరువాత – పార్వతికి మాత్రం బిడ్డలు పుడతారా?

ఆ దంపతులిద్దరూ కూర్చునే పాషాణవేదిక అయినా తల్లి అయింది, కాని, ఆమె అలాగే కొండచూలిగానే ఉండిపోయింది. ఇలాంటి పెళ్ళాన్ని, చూస్తే – ఒక్కొక్కప్పుడు ఎంత సాత్త్వికమూర్తి అయినా, – రాజిపోడూ? – దిగంబరి అయి

తిరుగుతాడన్నా, – దిసమొలతో, దారుకావనంలో ఒళ్ళు తెలియని శివాలెత్తాడన్నా –

అడో మగో అని పరకాయించి అయినా చూడకుండా, – మసకలో, సాటి నాలుగు చేతులవాడి మీదికి సంరంభించాడన్నా – ఇదంతా, ఆ మహాతల్లి మీద మంటేగా? –

అమరధామం అంతా యిన్ని అగచాట్ల పాలైపోయింది. ఆనాటి పొరపాటుతో! వాళ్ళ బ్రతుకులో ఏమన్నా మార్పు ఎన్నటికన్నా రావాలంటే – మనం తలచుకుంటేనే – కనికరిస్తేనే! –

లేదా – ఇలా మరిచిపోగా – మరచిపోగా, చివరకు నామమాత్రంగా నన్నా మిగిలేది – పార్వతి శాపమే!

★ ★ ★